# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-07-2025　　　　సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ రానున్న సంవత్సర కాలంలో 12 వేల కోట్ల డాలర్ల పెట్టుబడులను ఆకర్షించగలదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు.

- ❖ రైతుల సంక్షేమానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.

- ❖ విశాఖపట్టణంలో కొత్తగా 20 వేల 216 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన 4 సంస్థలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపిబి) ఆమోదం తెలిపింది.

- ❖ భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మాంచెస్టర్ లో జరుగుతున్న నాలుగవ టెస్ట్ మ్యాచ్ లో భోజన విరామ సమయానికి భారత్ వికెట్ నష్టపోకుండా 78 పరుగులు చేసింది.

- ❖ రాష్ట్రంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు రేపు అనేక చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

================================

అంతర్జాతీయ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ ముఖద్వారంగా మారుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రానున్న సంవత్సర కాలంలో 12 వేల కోట్ల డాలర్ల పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్ ఆకర్షించగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై ఏర్పాటు చేసిన "ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ" సదస్సును విజయవాడలో ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సదస్సుకి యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్, ఇన్వెస్టోపియా సీఈఓ జాన్ ఫెరోస్, రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ... ఇటీవల జరిగిన దావోస్ పర్యటనలో యూఏఈ ఆర్థిక మంత్రిని రాష్ట్రానికి రావాలని ఆహ్వానించానని చెప్పారు. విశ్వసనీయమైన భాగస్వామ్య దేశంగా భారతీయులకు యూఏఈ విస్తృతమైన అవకాశాలు కల్పిస్తోందని, అలాగే భారతీయులు కూడా ఆ దేశానికి సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలు ఉన్నాయన్నారు. పెట్టుబడులు పెట్టాలని భావించిన మరుక్షణం నుంచి అనుమతులు వచ్చే వరకూ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని, అనుమతుల అంశాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తుందని ఆయన ఈ

సందర్భంగా హామీ ఇచ్చారు. సమీప భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీ రంగానిదేనని.. దేశీయ లక్ష్యమైన 5 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో 160 మెగావాట్ల మేర ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తి చేయబోతోందని చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

================================

విశాఖపట్టణంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన 4 సంస్థలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపిబి) ఆమోదం తెలిపింది. ప్రతిష్టాత్మక సంస్థలైన సిఫి, సత్వా, బివిఎం, ఎఎన్ఎస్ఆర్ సంస్థలు 20 వేల 216 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాగా... ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో ఈరోజు జరిగిన 9వ ఎస్ఐపిబి సమావేశంలో వాటికి ఆమోదం లభించింది. 20 లక్షల ఉద్యోగాల కల్పన సబ్ కమిటీకి చైర్మన్‌గా ఉన్న మంత్రి నారా లోకేష్ ఈ సమావేశంలో ఆయా పెట్టుబడుల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. ఈ పెట్టుబడుల ద్వారా 50 వేల 600 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఇటువంటి ప్రతిష్టాత్మక సంస్థల రాకతో విశాఖ ఖ్యాతి మరింతగా పెరుగుతుందని ఈ సందర్భంగా వెల్లడించారు.

================================

రైతుల సంక్షేమానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా కాతేరు గ్రామ పరిధిలోని చాగల్నాడు ఎత్తిపోతల పథకం మొదటి దశ సాగునీటి విడుదల కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చాగల్నాడు ఎత్తిపోతల పథకం ద్వారా రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లోని 6 వేల 250 ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. చాగల్నాడు మొదటి దశ నుంచి లీడింగ్ ఛానల్ ద్వారా కోలమూరులో రెండవ దశకు.. అక్కడి నుంచి మరో లీడింగ్ ఛానల్ ద్వారా పాలచర్లలోని మూడవ దశకు.. అక్కడి నుంచి కాలువల ద్వారా పొలాలకు సాగు నీరు చేరుతుందని తెలిపారు. చాగల్నాడు ఎత్తిపోతల పథకం మొదటి దశలో ప్రస్తుతానికి ఒక పంపు మాత్రమే పనిచేస్తోందని, మిగిలిన వాటికి మరమ్మతులు పూర్తి చేసి త్వరితగతిన అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడిస్తూ....

(వాయిస్ 20 సెకన్లు)

విరామం

================================

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా రైళ్ల రాకపోకల్లో అనేక మార్పులు చేశామని దక్షిణ మధ్య రైల్వే ఈరోజు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈరోజు నుంచి మొదలుకొని ఆగస్టు 24వ తేదీ వరకూ మొత్తం 53 రైళ్లు పూర్తిగానూ.. మరికొన్ని పాక్షికంగా రద్దు చేయబడ్డాయని ఆ ప్రకటనలో పేర్కొంది. అదనంగా 50 రైళ్లను ఇతర మార్గాలకు మళ్లించగా, మరికొన్ని రైళ్ల సమయాల్లో మార్పులు చేశామని వెల్లడించింది. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి, తమ తమ ప్రయాణాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైల్వే శాఖ సూచించింది.

================================

చట్టసభల మహిళా సాధికారత కమిటీల జాతీయ సదస్సు తిరుపతి వేదికగా సెప్టెంబరు 14, 15వ తేదీల్లో జరగనుందని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ సదస్సు సన్నాహక ఏర్పాట్లపై తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... పార్లమెంట్ నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఈ సదస్సుని నిర్వహిస్తున్నామని చెప్పారు. లోక్ సభ సభాపతి ఓం బిర్లా ఈ సదస్సుకు హాజరుకానున్నారని వెల్లడించారు. చట్టసభలకు సంబంధించి మహిళా సాధికారత కమిటీపై అవగాహన కల్పించడానికి ఈ సదస్సు ఉపకరిస్తుందని అయ్యన్నపాత్రుడు వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==================================

కార్మికుల సామాజిక ఆరోగ్య భద్రత దృష్ట్యా తీసుకువచ్చిన నూతన స్ప్రీ ఆరోగ్య బీమా పథకాన్ని కర్మాగారాలు, సంస్థల యాజమాన్యాలు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్ఐసీ ప్రాంతీయ సంచాలకులు ఎం.రామారావు కోరారు. విజయవాడలోని ఈఎస్ఐసీ కార్యాలయంలో యజమానులు, ఉద్యోగుల రిజిస్ట్రేషన్ ప్రమోషన్ పథకం స్ప్రీ ప్రచార సామగ్రిని ఆయన అధికారులతో కలిసి ఈరోజు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... స్ప్రీ పథకాన్ని ఉపయోగించుకునేందుకు కర్మాగారాలు, సంస్థలు స్వచ్ఛందంగా నమోదు చేసుకునేందుకు ముందుకురావాలని సూచించారు. ఈ పథకం ద్వారా యజమాని ప్రకటించిన తేదీ నుంచే రిజిస్ట్రేషన్ చెల్లుబాటయ్యేదిగా పరిగణించడం జరుగుతుందని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==================================

ఇంగ్లాండ్‌లో మాంచెస్టర్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య నాలుగవ టెస్ట్ మ్యాచ్ ఈరోజు ప్రారంభమైంది. తొలుత బ్యాటింగ్ చేస్తున్న భారత్ భోజన విరామ సమయానికి వికెట్ నష్టపోకుండా 78 పరుగులు చేసింది. కాగా ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో ఇంగ్లాండ్ ఇప్పటికే 2-1 ఆధిక్యంలో ఉంది.

==================================

ఉత్తర బంగాళాఖాతంలో రానున్న 24 గంటల్లో ఉష్ణమండల తుపాను ఏర్పడేందుకు అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఈనెల 25వ తేదీన అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అనేక చోట్ల, భారీ నుండి అతి భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. బలమైన ఈదురు గాలులు గంటకు 40 నుండి 50 కిలో మీటర్ల వేగంతో వీయవచ్చని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

==================================
==================================